

# వైకుంఠయాత్ర

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

(ప్రారంభం)

A Person can survive almost anything…Except Death

- A SCOTISH PROVERB

ఉపోద్ఘాతం

రాజుగారి ఖజానాకే కన్నం వేశాడు గజదొంగ గంగులు. అందులోని అంతులేని సంపదను దోచుకుని పారిపోతుంటే పక్కదేశ సరిహద్దుల్లో గంగులుని పట్టుకున్నారు రాజభటులు.

సభకి తీసుకువచ్చారతన్ని.

"నువ్వు నేరం చేసినట్లు ఒప్పుకుంటున్నావా? లేదా?" సూటిగా ఒకే ఒక్క ప్రశ్న అడిగారు రాజుగారు.

"ఒప్పుకుంటున్నాను" సూటిగా సమాధానం చెప్పాడు గంగులు.

"ఈ నేరస్తుణ్ణి సూర్యాస్తమయంలోగా ఉరితీయండి" ఆజ్ఞాపించారు రాజుగారు.

వెంటనే ఉరికంబానికి తీసుకెళ్ళారు రాజభటులు గజదొంగ గంగులుని.

ఆ ఉరి అమలు జరపబడటం దగ్గరుండి చూడదలచి రాజుగారు కూడా ఉరికంబం దగ్గరకి చేరుకున్నారు.

గంగులు రెండు చేతులూ వెనక్కి విరిచి కట్టారు. మెడ చుట్టూ ఉరితాడుని ఉంచి ముడిని బిగించారు. రాజుగారి సైగ కోసం తలారి ఎదురుచూడసాగాడు. రాజు సైగ చేయగానే గంగులు కాళ్ళకింద వున్న చెక్కపలకలు కిందికి తెరుచుకునే మీటని నొక్కుతాడు తలారి.

సరిగ్గా ఆ సమయంలో ఎక్కడనుంచో నిగనిగలాడే తాచుపాము ఆ చెక్కపలక మీదకి పాక్కుంటూ వచ్చింది. దాన్ని చూడగానే గంగులు తప్పించుకుందామని వెనక్కి రెండడుగులు వేయడం గమనించారు రాజుగారు.

"ఏరా? ఎలాగూ కొద్దిక్షణాల్లో చావబోతున్నావుకదా? పాము నుంచి ఎందుకు తప్పించుకోవాలనుకున్నావు?" అడిగారు రాజుగారు.

"మీరు సైగ చేసేదకా, ఆ కొద్దిక్షణాలైనా బ్రతికి వుందామని రాజా" జవాబు చెప్పాడు గంగులు.

ఈ చిన్న పిల్లల కథ బోధించే నీతి ఒక్క గంగులుకే కాదు, సర్వమానవాళికీ వర్తిస్తుంది.

చచ్చేదాకా బ్రతికి వుండాలన్న కాంక్ష మనిషిలో అణువణువునా జీర్ణించుకునిపోయి వుంటుంది.

*తమ వైకుంఠ యాత్ర నేడుకాక, ఎప్పుడూ 'గోడమీద రాసిన రేపు' అయి వుండాలనుకుంటారు అన్నీ అనుభవించిన పండు ముసలివాళ్ళు కూడా.*

*అలాంటిది, ఇంకా జీవితంలోని దేన్నీ అనుభవించని యువకుడు పాతికేళ్ళ వయసులోనే ఆకస్మాత్తుగా వైకుంఠయాత్ర చేయాల్సి వస్తే?*

*అదీ మరొకరి బదులుగా తను చేయాల్సి వస్తే?*

*ఆ యువకుడి పేరే..శివాజీ.*

**బొంబాయిలో లోకల్** రైల్లో ప్రయాణిస్తూ అటూ, ఇటూ చూస్తే బాంద్రా స్టేషన్ వస్తూండగా ఎన్నో వందల అపార్ట్‌మెంట్ బిల్డింగ్స్, వాటి బాల్కనీల్లో ఆరేసిన బట్టలు కనబడతాయి.

వాటిల్లోని ఓ సింగిల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్‌లో తన తల్లి పావనితో శివాజీ వుంటున్నాడు.

బి.ఎస్సీ. కంప్యూటర్స్ పూర్తిచేసి పై చదువులకి డబ్బు లేకపోవడంతో ఓ చిట్‌ఫండ్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉదయం పనిచేస్తూ, ఈవినింగ్స్‌లో 'నిట్'లో అడ్వాన్స్‌డ్ కోర్స్ చేస్తున్నాడు. శివాజీ తల్లి పావని బాంద్రాలోని ఓ జూనియర్ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తోంది.

శివాజీకి గుజరాతి, మరాఠి, హిందీ, ఇంగ్లీష్‌లతోపాటు తెలుగు కూడా వచ్చు. తల్లి మాతృభాష తెలుగు కాబట్టి ఇంట్లో తెలుగే మాట్లాడుకుంటారు. బుద్ధి తెలిశాక శివాజీ తన తండ్రినికాని, బంధువులను కానీ ఎవరినీ చూడలేదు. ఆ విషయాలు తన తల్లికి యిష్టంలేదని గ్రహించాడు శివాజీ. ఎన్నిసార్లు ఆ వివరాల గురించి ప్రశ్నించినా ఆమె "నాకీ ప్రసక్తి ఇష్టంలేదురా కన్నా. ఇంకెప్పుడూ నా దగ్గర ఈ మాటలు తీసుకురాకు" అనే చెపుతుంది. ఆమె ధోరణి పసిగట్టిన శివాజీకి విషయం అర్థమైంది. చెడ్డ సంఘటనలు కొన్ని జరిగి వుంటాయని, తన తల్లిని బంధువులు వెలివేశారో, లేక ఆమే వాళ్ళని దూరం చేసుకుందోనని అనుకోసాగాడు.

అయితే వయసు పెరిగేకొద్దీ శివాజీకి ఆ విషయం మీద ఆసక్తి అధికమవుతూ వస్తోంది. రహస్యంగా ఇంట్లోని కాగితాలని, వస్తువలని వెదికినా ఆ విషయాలు తెలిపే వివరాలేవీ అతనికి లభ్యంకాలేదు. ఏనాటికైనా తల్లి తనకి ఆ రహస్యం చెపుతుందని అతని ఆశ.

అందరిలా, తనకూ ఓ బాబాయ్, ఓ పెదనాన్న, ఓ అత్త, ఓ పెద్దమ్మ, ఓ కజిన్, ఓ మమయ్య వుంటే బాగుండునని తరచూ అనుకుంటాడు శివాజీ.

1

"గుడ్ ఈవెనింగ్ మమ్" చెప్పాడు శివాజీ లేచి కూర్చుని.

"గుడీవినింగ్"

మ్రోగే అలారం టైం పీస్ అందుకని దాన్ని నొక్కి బెల్‌ని ఆపాడు. లేచి బాత్‌రూంలోకి వెళ్ళి చన్నీళ్ళతో మొహం కడుక్కున్నాడు.

"ఆకలేస్తోందా?" అడిగింది పావని.

"బాగా. టిఫిన్ ఏం చేశావు?"

"ఢోక్లాలు - ఫ్రిజ్‌లో వున్నాయి."

ఆవిరిమీద వరి, శెనగపిండితో చేసే డోక్లా మరాఠీ వంటకం. ఫ్రిజ్ తెరచి నాలుగు డోక్లాలు ప్లేటులో వేసుకుని, మిరపపొడిని చల్లుకుని తినసాగాడు.

"రాఖీ గురించి ఏమైనా రాశారా?" అడిగాడు తల్లి స్టార్ డస్ట్ చదువుతుండటం గ్రహించి.

"లేదు, ఈసారి మాధురీ దీక్షిత్ మీద రాశారు గాసిప్."

"ఇంట్రెస్టింగ్?"

"నాట్ మచ్."

ఆ తల్లీ కొడుకులు తెలుగుతో సమానంగా ఇంగ్లీషులో కూడా మాట్లాడుకుంటూంటారు. అది బొంబాయి ఇన్‌ఫ్లుయెన్స్ వల్ల వచ్చిన అలవాటు. అలాగే చాలా విషయాలు ఒకరితో మరొకరు నిర్మొహమాటంగా ఫ్రీగా చర్చించుకుంటారు. ఇతరులు అభ్యంతరకరమైనవిగా భావించే చాలా విషయాలు.

లోకంలో ఎయిడ్స్ వ్యాధి, సినీ తారలకి అక్రమ సంబంధాలు, పొరుగువారికి ఎక్స్‌ట్రా మేరిటల్ సంబంధంలాంటివి వుంటే, అవసలు ప్రపంచంలో లేనట్లుగా నటించి, అలాంటి టాపిక్స్‌ని దూరంగా వుంచడం చేయరు ఆ యిద్దరూ. పావనిలో ఎలాంటి హిపోక్రసీ లేకపోవడంవల్ల వాళ్ళింట్లో ఈ పద్ధతి వచ్చింది.

"ఈ రోజు శనివారం' గుర్తుచేసింది పావని శివాజీకి.

"అవును. ఏడున్నరకల్లా వింపికి వెళ్ళాలి."

"అంటే నువ్వు డిన్నర్‌కి రానట్లేగా?" అడిగింది పావని లేచి వంటగదిలోకి వెడుతూ.

"ఊహూ! షల్ ఐ కేరీ సమ్‌థింగ్ ఫర్ యు మమ్! మే బి మష్రూమ్ చికెన్, స్టీమ్డ్ రైస్ అండ్."

"వద్దొద్దు. వాటికంటే నేను చేసుకుని తినే పచ్చడి మెతుకులే నాకు బాగుంటుంది" వంట గదిలోనుంచి సమాధానం చెప్పింది.

శివాజీ డ్రస్ చేసుకునేలోగా ఆమె టీ కప్పుతో వచ్చింది.

"వెళ్తూ ఈ నవల రిటర్న్ చేయడం మర్చిపోకు. అద్దె కట్టుకోవాలి లేకపోతే" ఓ పుస్తకం అందించి చెప్పింది పావని. దానిమీద 'బాంద్రా బుక్ క్లబ్' అన్న రౌండ్ రబ్బరు స్టాంప్ పూర్తి అడ్రసుతో వేసి వుంది.

"ఎలా వుందమ్మా ఇది?" అడిగాడు.

"నైస్. కాని, నీకు నచ్చదు."

"అదేం?"

"నీకు ది ఫర్మ్, ది క్లయింట్, ది పెలికాన్ బ్రీఫ్‌లు నచ్చినట్లుగా 'గుడ్ ఎర్త్, ఆఫ్ 'హ్యూమన్ బాండేజ్'లు నచ్చవు ఐ డోంట్ లైక్ థ్రిల్లర్స్ దేరీజ్ నో లైఫ్ ఇన్ దెమ్. కానీ ఇవన్నీ జీవితాన్ని డెపిక్ట్ చేసేవి. ఐ విష్ సమ్ డే యు వుడ్ స్టార్ట్ రీడింగ్ మామ్ అండ్ జేన్ ఆసిటన్స్ అండ్ పెరల్. ఎస్ బక్ అండ్."

"అవన్నీ బోర్ మమ్మీ"

"లిటరేచర్ అంటే ఇవేరా. లిటరేచర్ ఈజ్ రిఫ్లెక్షన్ ఆఫ్ లైఫ్ త్రూ ది మీడియం ఆఫ్ లాంగ్వేజ్. యు నో?"

"నా డ్రెస్ ఎలా వుందమ్మా?" అడిగాడు శివాజీ.

అతని ఒంటిమీద జీన్స్ ప్యాంట్, మేచింగ్ జీన్స్ షర్టులను చూసి చెప్పింది.

"ఫిట్స్ ఫర్ ది అవుట్ ఫిట్ యు ఆర్ హెడింగ్ టు."

శివాజీ మూడో అంతస్తులోని తమ అపార్ట్‌మెంట్‌లోనుంచి మెట్లమీదనుంచి కిందకి దిగాడు. దిగుతూండగా పైకి వస్తున్న ఓ ముసలావిడని చూసి పలకరించాడు.

"క్యై సే హై మాసీజీ?"

"ఠీక్ హై. మమ్మీ క్యై సే హై?" అడిగిందావిడ.

"ఆఫ్ ఏక్ దిన్ ఆనా, జబ్ దేఖ్‌నా."

నవ్విందావిడ బదులుగా.

సరిగ్గా అయిదు నిమిషాల నడక దూరంలో వుంది బాంద్రా లోకల్ రైల్వేస్టేషన్. శివాజీ స్టేషన్‌లోకి వెళ్ళిన అయిదు నిమిషాలకి వచ్చింది ఫాస్ట్ ట్రైన్ (లిమిటెడ్ స్టాప్స్‌లో ఆగే లోకల్‌ని ఫాస్ట్‌గా పిలుస్తారు బొంబాయిలో)

శనివారం కాబట్టి రద్దీగా లేదు. జేబులో వున్నది సెకండ్ క్లాస్ పాస్ అయినా, ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లోకి ఎక్కాడు శివాజీ. సీట్లో కూర్చున్నాడు. 'కేపిటల్ మార్కెట్'ని చదువుకుంటున్నాయన ఓసారి శివాజీ వైపు చూసి, మళ్ళీ తను చదివే పెట్రో కెమికల్స్‌కి సంబంధించిన ఆర్టికల్‌లో మునిగిపోయాడు.

శివాజీ ట్రైన్ ఆగినప్పుడల్లా అలర్ట్‌గా కిటికీలోనుంచి చూస్తున్నాడు చెకింగ్ ఇన్స్‌పెక్టర్స్ వస్తున్నారా అని. అందరి మొహాలూ అతనికి పరిచయమే. వాళ్ళు కనపడితే పక్కనే వున్న సెకండ్ క్లాస్‌కి వెనకనుంచి దిగి మారడానికి సిద్ధంగా వున్నాడు.

లోకల్ చర్చ్ గేట్‌లో ఆగింది. ఫ్లోరా ఫౌంటెన్ వైపు నడక సాగించాడు. అక్కడున్న 'వింపి' అనే నైట్ క్లబ్‌లోకి నడిచాడు.

"హాయ్" విష్ చేసింది స్టివార్డ్ డిసౌజా.

"హాయ్" బదులుగా విష్ చేశాడు.

"నా ప్రశ్నకు సమాధానం తట్టిందా డిసౌజా?" అడిగాడు.

"ఏమిటి? పరిచయంలేని అమ్మాయితో ఎలా పరిచయం చేసుకోవాలనా?"

"అవును"

"ఓ లేడీస్ హేంకీ కొని అది కిందపడిందని..."

"ఓల్డ్ ట్రిక్. ఐ వాంట్ సమ్‌థింగ్ న్యూ."

"చీర బావుందని మెచ్చుకోవడం బాగోలేకపోయినా సరే."

"ఊహూ. చీరని కాక అందులోని అందాన్ని మెచ్చుకుంటారు ఎవరైనా.

మీ బాయ్ ఫ్రెండ్ ఎలా పరిచయం అయ్యారు మీకు?"

"కొత్త కర్చీఫ్ కొని ఇది మీదేనా అని.." నవ్వేసింది.

"జోక్ కాదు నిజం చెప్పండి."

"మా ఇంట్లో అద్దెకుండేవాడు"

"ఇకనేం?"

క్లబ్ రద్దీగా వుంది.

రాత్రి ఏడున్నర నుంచి రద్దీ మొదలవుతుందక్కడ. పన్నెండున్నరదాకా తెరిచే వుంటుందది. ఆరి వెలిగే రకరకాల విద్యుత్ దీపాలతో ఎంతో అందంగా, ఆకర్షణీయంగా వుండే ఆ క్లబ్‌కు అన్ని భాషలవాళ్ళూ వస్తుంటారు లైట్ మ్యూజిక్‌ని అందిస్తుందా క్లబ్.

శివాజీ కార్డ్‌లెస్ మైక్‌లో శని, ఆదివారాలు రాత్రుళ్ళు రాత్రికి నాలుగు గంటల చొప్పున పాటలు పాడతాడు అతనికి వచ్చిన అన్ని భాషల పాటలు పాడతాడు.

మిమిక్రీ కూడా వచ్చిన శివాజీ ఘంటసాల, జిక్కీ, పి.సుశీల ఏ.ఎం రాజా కంఠాలని యధాతథంగా అనుకరించడంలో నిపుణుడు. ఆ విద్య వల్లే అతనికి అక్కడ పార్ట్ టైమ్ ఉద్యోగం దొరికింది.

"గుడీవినింగ్ లేడీస్ అండ్ జెంటిల్మేన్. రేపే బడ్జెట్ డే సర్దార్ సాహెబ్ మనల్ని ముంచనున్నాడో, లేక తేల్చనున్నాడో.. యూ నో.. డెత్ అంట్ టాక్సెస్ ఆర్ ఇనెవిటబుల్. బట్ డెత్ ఈజ్ నాటే రిపీటర్.

అతని జోక్‌కి అంతా నవ్వారు. శివాజీ ఆ జోక్‌లో అనుకోకుండా 'డెత్' అనే పదాన్ని ఉపయోగించాడు, జరగబోయేదానికి నాదిగా అన్నట్లుగా.

ఆ నైట్ క్లబ్‌కు హాజరైన వాళ్ళలో కొందరు తమ ఫేవరెట్ సాంగ్స్‌ని కాగితం మీద రాసి శివాజీకి పంపిస్తుంటారు. అవి పాడటం తనకి వస్తే వాటిని పాడుతుంటాడు శివాజీ.

ఆ విధంగా ఆ రోజు నాలుగు పాటలు పాడమని రిక్వెస్ట్‌లు వచ్చాయి. అందులో ఒకటి - 'ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపు సొలుపేమున్నది.'

అదే చేతిరాత.

అదే పాట.

ఆ కాగితాలన్నీ చదివాక శివాజీ నైట్ క్లబ్ కస్టమర్స్ వంక చూశాడు. ఓ కార్నర్ టేబుల్ ముందు కూర్చుని వుందామె.

ఆ చేతిరాత ఆమెదే అయి వుంటుందని ఊహించాడు శివాజీ. ప్రతిసారీ ఆమెదే అనుకుంటూంటాడు. ఆ పాట పాడేప్పుడు ఆమె శ్రద్ధగా వినడాన్నిబట్టి. ఆ రిక్వెస్ట్ వచ్చినప్పుడల్లా ఆమె క్లబ్‌లో వుండటం చేత, ఫెమినైన్ టచ్ ఆ చేతిరాతకి వుండటంచేత శివాజీ ఆ అంచకి వచ్చాడు.

ముందు ఎల్విస్ ప్రెస్లి పాట 'లుక్ లై కేన్ ఏంజెల్ వాక్ లై కేన్ ఏంజెల్, టాక్ లై కేన్ ఏంజెల్' పాడాడు. తర్వాత క్లిఫ్ రిచర్డ్ 'రాకి లిప్స్ ఆర్ కిస్సబుల్' ఆ తర్వాత ఫ్రేంక్ సినాట్రా 'ఓల్డ్ సమ్మర్ వైన్' పాడాడు. చివరగా ఘంటసాల, సుశీల కంఠాలను అనుకరించి 'ఆడుతు పాడుతు పనిచేస్తుంటే' పాడాడు. ఆమె ఆ పాటను శ్రద్ధగా విన్నది.

ఎప్పటిలా చివరిలో వంగి కస్టమర్స్‌కి అభివాదం చేసి చెప్పాడు.

"థాంక్ యు లేడీస్ అండ్ జెంటిల్‌మేన్. థాంక్యూ వెరీమచ్."

కొందరు లేచి అయిదులు, పదులు, బాగా మందుమీదున్నవాళ్ళు ఏభైలు, వందలు కూడా బక్షీస్‌గా శివాజీకి యిచ్చారు. కొందరు చేతికిస్తే, కొందరు అతని నోటికందించారు.

ఎప్పటిలా ఆ అమ్మాయి బక్షీస్ ఇవ్వలేదు. మిగిలిన స్టాఫ్‌తో భోజనం చేశాడు శివాజీ. దాల్, రోటి, వెజిటబుల్ సబ్జి, మజ్జిగన్నం. తల్లితో చెప్పినట్లు మష్రూమ్ చికెన్ కర్రిగాని, స్టీమ్డ్ రైస్ కానీ స్టాఫ్‌కి పెట్టరు. అది బిల్ చెల్లించే కస్టమర్స్‌కి మాత్రమే.

రాత్రి ఒకటిన్నరయింది శివాజీ ఇంటికి చేరుకునేసరికి. తలుపు తాళం తీసి నిశ్శబ్దంగా లోపలకు వెళ్ళాడు తల్లికి డిస్టర్బ్ కాకూడదని.

చన్నీళ్ళతో స్నానం చేసి షార్ట్స్ మాత్రం తొడుక్కుని మంచమ్మీద పడుకున్నాడు. కిటికీలోనుంచి వెన్నెల అతనిమీద పడుతూంటే, చందమామవంక చూస్తూండిపోయాడు కాసేపు.

శివాజీకి పదే పదే ఆ అమ్మాయే గుర్తుకు రాసాగింది. పంతొమ్మిది - ఇరవై రెండు మధ్య వుంటుంది ఆమె వయసు. గుండ్రటి మొహం, పెద్ద కళ్ళు, చామన్ ఛాయ కాదు నలు. నలుపే. అయినా ఎంతో కళగా వుంది ఆమె మొహం. ఎంతో చురుగ్గా వున్నాయి ఆ కళ్ళు.

ఆమె అందానికి కారణం ఆమె రంగే అయివుంటుందనుకున్నాడు శివాజీ. అదే ఆమె తెల్లగా వుంటే అంత అందంగా వుండేది కాదు.

పేరు ఏమై వుంటుంది?

తెలుగమ్మాయేనా?

ఎక్కడుంటుందో? ఏం చేస్తోందో? ఒంటరిగా వస్తోంది అంటే బాయ్ ఫ్రెండ్స్ వుండి వుండరు.

మళ్ళీ శనివారం కూడా ఆమె వస్తే ఈసారి తప్పనిసరిగా పరిచయం చేసుకోవాలనుకున్నాడు.

"ఓ చందా... మై తుమ్ సే ప్యార్ కర్ లూంగా" అన్న పాట అప్రయత్నంగా అతని నోట్లోంచి వచ్చింది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in